యూరియా.. ఏదయా!

కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు



రసాయన ఎరువులు లేనిదే పంటలు సాగు చేయలేని పరిస్థితి. ప్రస్తుతం పంటలకు యూరియా వేసేందుకు అదును. డిమాండ్ నేపథ్యంలో వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టిస్తూ ధరలను అమాంతం పెంచేశారు. అయినా సకాలంలో నత్రజని దొరకని పరిస్థితి. ఒకవేళ దొరికినా అధిక ధరలు చెల్లించాల్సిందే. ఇంత జరుగుతున్నా నియంత్రించాల్సిన అధికారులు సైతం వ్యాపారులతో కుమ్మక్కయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌కు 35,344 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకు సగం కూడా రాలేదని డీలర్లే చెబుతుండటం గమనార్హం.

- రెట్టింపు ధరలకు విక్రయాలు
- బస్తాపై రూ.100 నుంచి రూ.150 అధికం
- భారీగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- అక్రమార్కులపై చర్యలు శూన్యం
- సీజన్‌కు 35,344 మెట్రిక్ టన్నులు అవసరం
- నేటికీ సగం కూడా సరఫరా కాని వైనం



పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీజన్ ప్రారంభంలో కావాల్సిన విత్తనాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు నార్లు పోసి నాటు వేయడానికి సిద్ధంగా ఉన్న ఈ తరుణంలో యూరియా లభ్యంకాక ఆందోళన చెందుతున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలకు నత్రజని వాడకం తప్పనిసరి. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌కుగాను 35,344 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటి వరకు సగం కూడా రాలేదని స్వయంగా డీలర్లే చెబుతుండటం గమనార్హం. చెబుతున్నారు. అయితే పైనుంచే సరఫరా లేకపోవడంతో సమస్య తీవ్రంగా మారుతోంది. దీనికి తోడు కృత్రిమ కొరతను సృష్టించి కూడా కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారు. 50 కేజీల యూరియా బస్తా ధర రూ.266కు విక్రయించాలి. కాగా, ప్రస్తుతం రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. అధిక ధరలపై రైతులు నిలదీస్తే ఎరువులు లేవని చెబుతున్నారు. బిల్లులు ఇవ్వాలని అడిగినా ఇష్టం ఉంటే కొనుకోండి లేదంటే వెళ్లండి అని చెబుతున్న దుస్థితి.

ఇటీవల పరిగిలోని ఆగ్రోస్ కేంద్రం వద్ద యూరియా దొరకడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేసిన సంగతి విదితమే. ఇక్కడ గత వానకాలంలోనూ ఎరువులను ఎక్కువ ధరలకే అమ్మిన విషయం అప్పట్లో దుమారం లేపింది. అక్రమాలకు పాల్పడిన

మిగతా 8వ పేజీలో...

అధిక ధరలకు కొంటున్నాం



అవసరానికి మార్కెట్‌లో యూరియా దొరకడం లేదు. ఎంపిక చేసిన కొన్ని షాపుల్లోనే విక్రయిస్తున్నారు. అక్కడ కూడా ఎక్కువ ధరలకు ఇస్తున్నారు. కొందరు అయితే మరో మందు కొనుగోలు చేస్తేనే యూరియాను ఇస్తామంటున్నారు. ఎందుకు అని నిలదీస్తే, అంతే అని దబాయిస్తున్నారు. రశీదు కూడా ఇవ్వడం లేదు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

-గోలినాయక్, రైతు, నజీరాబాద్‌తండా

రాహుల్‌కు నోటీసులు ఇవ్వడం తగదు

- పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



పరిగిలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వడం తగదని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని సాధించడంలో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపిస్తూ తగిన ఆధారాలను చూపారన్నారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో లక్ష ఓట్లకుపైగా బోగస్ ఓట్లు ఉన్నట్లు సాక్షాదారాలతో చూపిస్తే ఎన్నికల సంఘం నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

వికారాబాద్, షాద్‌నగర్‌లకు నాలుగులేన్ల రోడ్డు

పరిగి నుంచి షాద్‌నగర్, వికారాబాద్ వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణాలు త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. లక్నాపూర్ వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. గడిసింగాపూర్ - రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు, లక్నాపూర్ వరకు కూడా కొత్త రోడ్డు నిర్మిస్తామన్నారు.

చెరువులు, కుంటలకు జలకళ

- జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం
- మోమిన్‌పేటలో 57.8మి.మీ వర్షపాతం



బషీరాబాద్: జీవన్గి ఎస్సీ కాలనీలో మునిగిన ఇల్లు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అలాగే పలుచోట్ల సోమవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మోమిన్‌పేటలో అత్యధికంగా 57.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాలాల మండలం ధావలాపూర్‌లో 37.0మి.మీ, వికారాబాద్‌లో 27.8మి.మీ, నవాబుపేటలో 20.3మి.మీ, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాయత్రీ నగర్‌లో 27.8మి.మీ చొప్పున

మిగతా 8వ పేజీలో...



భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఐక్యతగా దేశభక్తిని చాటాలి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఐకమత్యంగా దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ నాయకులు మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో 75 గజాల త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజలు ఐకమత్యంగా ఉన్నప్పుడే పహెల్గామ్ లాంటి ఉగ్ర దాడులను తిప్పికొట్టగలమన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ నాయకులు శైలజ హరినాథ్, ప్రభాకర్ రెడ్డి, అమరం మోహన్‌రెడ్డి, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి పల్లకీ సేవలో భక్తులు

కనుల పండువగా పల్లకీ సేవ

కీసర, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో శ్రీ రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. శ్రావణ సోమవారం పురస్కరించుకొని ఉదయం గర్భాలయంలోని మూల విరాట్‌కు శ్రీమహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో అలంకరించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికి..



పైరవీల్లో బిజీగా స్థానిక నేతలు

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లని వైనం
- ఆందోళనలో మూడుచింతలపల్లి ప్రజలు

మూడుచింతలపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం వస్తే తమ బతుకులు మారుతాయని ఎన్నో ఆశలతో ఓట్లేసి గెలిపించిన ప్రజలకు నిరాశే మిగిలింది. స్థానిక నేతలను నమ్మి వారు చెప్పిన వారికి ఓట్లేస్తే తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారంతా తమ పనులు చేసుకుంటూ స్థానిక సమస్యలను గాలికి వదిలేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన వారు పైరవీల్లో బిజీబిజీ అయ్యారు. మేడ్చల్ జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎవరూ విజయ సాధించకపోవడంతో స్థానికంగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులదే హవా నడుస్తోంది. దీనికి తోడు రాష్ట్ర స్థాయి నాయకుల పేర్లు చెప్పి వారంతా అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే ఇక్కడి నుంచి బదిలీ చేయిస్తామంటూ అధికారులను బెదిరిస్తూ తమ పనులు కానిచ్చేస్తున్నారు. ప్రధానంగా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా నాయకులు, అధికార ప్రతినిధులు గ్రామాలను సందర్శించిన సమయంలోనే ప్రజలతో మమేకమైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మిగతా సమయంలో వారిని గాలికి వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు అధికార పార్టీలో వర్గాలు ఏర్పడి ఎవరికి వారు ఎమునా తీరు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరి దగ్గరికి వెళ్లి తమ గోడు చెప్పుకోవాలో తెలియక పోవడంతో అర్హులకు సైతం ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందడం లేదని పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బడా నేతల పేరు చెప్పి..

మూడుచింతలపల్లి పరిధిలో ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల గురించి కనీస సమాచారం అందించే నాథుడు కరువయ్యారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పేద వర్గాలకు ప్రభుత్వానికి మధ్య అంతరం ఏర్పడుతుందని వాపోతున్నారు. కాంగ్రెస్ పార్టీలో స్థానికంగా కీలకంగా వ్యవహరిస్తున్న ఓ నేత పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్ పేరు చెప్పి పైరవీలు చేస్తూ స్థానికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలతో పాటు కింది స్థాయి నేతలు సైతం చర్చించుకోవడం గమనార్హం. దీంతో మరో వర్గంలో అలకలు మొదలు కావడంతో వారిని పిలిపించి అధిష్ఠానం సర్దిచెప్పినట్లు సమాచారం. స్థానిక నేతల ఆగడాలతో ప్రజలు విసుగెత్తి పోతున్నారని ఇది ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంతో మరికొందరు నేతలు కాంగ్రెస్ పార్టీ నుంచి మారే అవకాశమూ లేకపోలేదని తెలుస్తోంది.



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరూ ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులిపురుగులు పిల్లల ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తాయన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఆగస్టు 11న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ రోజు మాత్రలు మిస్ అయిన పిల్లలకు రేపటి నుంచి 19వ తేదీ వరకు అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మాత్రలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి లలితాదేవి, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, డాక్టర్ పవిత్ర, రెసిడెన్షియల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ప్రోగ్రాం అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వంటగదిని పరిశీలించి బియ్యం నాణ్యత, మెనూ ప్రకారం భోజనం వడ్డింపు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 84 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ఆర్డీవో వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏవో, సెక్షన్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితులకు ఊరట

- తాండూరు, వికారాబాద్ ఆస్పత్రుల్లో కొత్తగా 5 బెడ్లు, 5 మిషన్ల చొప్పున బిగింపు
- సోమవారం నుంచి అందుబాటులోకి సేవలు

తాండూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డయాలసిస్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. కొన్నాళ్లుగా బాధితులు పడుతున్న బాధలను 'జనవరి 20న డయాలసిస్ గుబులు' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కథనాన్ని ప్రచురిస్తూ బాధితుల కష్టాలను వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. అప్పట్లో ఆ కథనంపై స్పందించిన అధికారులు బెడ్లను మంజూరు చేసిన విషయం విదితమే. ఆ బెడ్లు సోమవారం తాండూరు డయాలసిస్ కేంద్రంలో అమర్చారు. తాండూరు జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రానికి 5 బెడ్లు, 5మిషన్లను, వికారాబాద్ ఆస్పత్రికి 5 బెడ్లు, 5 మిషన్ల చొప్పున అమర్చారు. ప్రస్తుతం డయాలసిస్ రోగులు జిల్లా వ్యాప్తంగా తాండూరులోనే అధికంగా ఉన్నారు. ప్రస్తుతం 60 మందికి పైగా రోగులకు సిబ్బంది సేవలను అందిస్తున్నారు. 40 మంది వెయిటింగ్ లిస్టులో ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సోమవారం ఆరోగ్య శ్రీ రాష్ట్ర జనరల్ మేనేజర్ డాక్టర్ రాంబాబు, డీవైఈవో శ్రీనివాసులు నూతన బెడ్లను ప్రారంభించారు. 60 మందికి ప్రస్తుతం 8 మిషన్లను వినియోగిస్తున్నామన్నా సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తమ దృష్టికి రావడంతో అదనంగా 5 బెడ్స్, మిషన్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సతీశ్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి టీం లీడర్ వీరేశం, తాండూరు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, తెలంగాణ డయాలసిస్ అపెక్స్ మేనేజర్ కిషన్, కిశోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కొత్త బెడ్లను పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర జనరల్ మేనేజర్ రాంబాబు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ మను చౌదరి

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కీసర, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఆయన సోమవారం అంకిరెడ్డిపల్లిలోని బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుష్ప గుచ్ఛం అందజేసి, మార్చ్‌ఫాస్ట్‌తో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులకు గణితం, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సివిల్స్, ఇతర రంగాల చదువుల్లో, వ్యాపార రంగంలో ఏమైనా సలహాలు, సూచనలు కావాలంటే సహాయం చేస్తానని ఆయన తెలిపారు. ఈ మేరకు తన మెయిల్ ఐడీని విద్యార్థులకు తెలిపారు. పాఠశాల, కళాశాల విద్యార్థుల సంఖ్య, భవనం అద్దె వివరాలు ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసున్నారు. యజమాని అద్దె పెంచాలని అడుగుతున్నారని, బోరు లేకపోవడంతో నీటికి తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు తెలియజేశారు. మరమ్మతుల ఎస్టిమేషన్ నివేదికను పంపించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, ప్రిన్సిపల్ రాజమణి, సంబంధింత అధికారులు పాల్గొన్నారు.

మొత్తం 71 దరఖాస్తుల స్వీకరణ

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 71 దరఖాస్తులు స్వీకరించారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

మాడ్గుల, అగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిళ్ల రైతు వేదికలో సోమవారం 'మేరా రేషం-మేరా అభిమాన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రాఘవేందర్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరత్న పాల్గొన్నారు. పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. పట్టు పురుగులు, మల్బరి సాగులో కలిగే సమస్యలపై, పంట సాగులో వచ్చే లాభాలపై వివరించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. కొర్రతండాలో రాజు అనుభవాన్ని రైతులకు వివరించారు. ఏడీ రైతు శ్రీపాతి రాజిరెడ్డి పొలాన్ని సందర్శించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురమ్మల సత్తయ్య, మాజీ సర్పంచ్ బండ నర్సింహ, ఎస్.రాజిరెడ్డి, ఎండీ జాకిర్ హుస్సేన్, బాతల్‌రాజ్‌గౌడ్, బొజ్జ నర్సిరెడి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం



కార్యకర్తలతో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

చేవెళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి చేస్తోందని శంషాబాద్ ఏబీవీపీ కన్వీనర్ సూర్యప్రకాశ్ తెలిపారు. ఏబీవీపీ చేవెళ్ల పట్టణ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆయన ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జాతీయ భావాలు నింపుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా హారిక, ఉపాధ్యక్షులు హర్షిత, అనిల్, హరికృష్ణ, మహేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా శిరీష, వివేకానంద, ఆకాశ్, ప్రశాంత్‌లు ఎన్నికయ్యారు.


రేషన్ కార్డులు అందజేస్తున్న సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం

కందుకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు బొక్క సంజీవరెడ్డి, సొదప శేఖర్‌గౌడ్ అన్నారు. కొత్తగూడలో మొదటి విడతో మంజూరైన తెల్లరేషన్ కార్డులను సోమవారం పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, బిబివేందర్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

రాహుల్, ప్రియాంకల అరెస్ట్ అప్రజాస్వామికం


మోదీ, అమిత్‌షాల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

కడ్తాల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అవకతవకలు, బిహార్‌లో ఓట్ల తొలగింపును నిరసిస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనను అడ్డుకొని ఏఐసీసీ నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ తదితర నాయకుల అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కడ్తాల్‌లో సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీజేపీ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పీఏసీఎస్ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బీసీసెల్ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బ్లాక్ నర్సింహ, రాంచందర్, జహంగీర్ అలీ, శేఖర్‌గౌడ్, రామకృష్ణ, బాబ, తులసీరామ్, యాదయ్యగౌడ్, బాల్‌రాజ్, లక్ష్మయ్య, కిషన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నాబార్డు జీఎం ముఖర్జీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న గంప వెంకటేశ్

నాబార్డు జీఎంను కలిసిన డీసీసీబీ డైరెక్టర్

ఆమనగల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ సోమవారం నాబార్డు జీఎం ముఖర్జీని మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీబీ బ్యాంకు సందర్శనకు జిల్లా కేంద్రానికి వచ్చిన జీఎంను డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్యాక్స్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను జీఎంకు వివరించారు. ఆమనగల్లు డీసీసీబీ జిల్లాలోనే అత్యధికంగా రూ.25కోట్ల బంగారు రుణాలు ఇవ్వడంపై ఆయన అభినందించారు. డీసీసీబీని మరింత లాభాల బాటలోకి తీసుకెళ్లాలని జీఎం సూచించినట్లు వెంకటేశ్ పేర్కొన్నారు. డీసీసీబీ సీఈవో పురుషోత్తం, రంగారెడ్డి జిల్లా డైరెక్టర్ భూపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి

కందుకూరు, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బీమా పాలసీ తీసుకునే సమయంలో ఖాతాదారులు సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలని కందుకూరు ఎస్‌బీఐ మేనేజర్ రవినాయక్ అన్నారు. సోమవారం సీఎస్‌ఎల్, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మండలంలోని బేగరికంచలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బీమా తీసుకునే సమయంలో కొత్త వ్యక్తుల ప్రమేయం తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేందర్, సీఎస్‌పీ రజిత, సిబ్బంది పాల్గొన్నారు.


స్వేరోస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బాబునాయక్‌ను సన్మానిస్తున్న స్థానికులు

సమసమాజం కోసం స్వేరోస్ కృషి

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు స్వేరోస్ పని చేస్తుందని సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బాబునాయక్ అన్నారు. సోమవారం పరిగిలో స్వేరోస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుశిక్షిత 'వారియర్ స్వేరో' కోర్ సైనికులను తయారు చేస్తామని తెలిపారు. ఇందుకు అన్ని జిల్లాల్లో పర్యటిస్తామన్నారు. సమాజ శ్రేయస్సుకు స్వేరోస్ పనిచేస్తుందన్నారు. సమావేశంలో స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజేశ్, నాయకులు నరేందర్, రాజు, ముకుంద్, శ్రీనివాస్, కమిటీ సభ్యులు సుదాకర్, వెంకట్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సహకార సంఘం ఎన్నికల్లో ...

ధర్మారెడ్డి ప్యానెల్ ఘన విజయం


ఎన్నిక పత్రాలు చూపుతున్న ఉద్యోగ సహకార సంఘం ఎన్నికల విజేతలు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సహకార సంఘం ఎన్నికల్లో ధర్మారెడ్డి ప్యానెల్ ఘనవిజయం సాధించింది. హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల ఉద్యోగుల హౌసింగ్ కో-ఆపరేటివ్ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నో ఏళ్ల తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 636 ఓటర్లకు 512మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ధర్మారెడ్డి ప్యానెల్‌లోని 9మందికి 9మంది విజయం సాధించారు. కాలనీ నూతన కమిటీ బాధ్యులుగా ధర్మారెడ్డి, కరుణాకర్, సత్యనారాయణరెడ్డి, రమేశ్, పోద్దార్, గోపాల్, రామచంద్ర, ఎంఠామదేవి, శాంత ఎన్నికయ్యారు. మూడేళ్లపాటు కొనసాగే ఈ కమిటీ ఎన్నికల నిర్వహణ అధికారిగా ఎండీ.యూనస్ అలీ వ్యవహరించారు.

మహిళలను సంఘాల్లో చేర్పించాలి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా లేని మహిళలను గుర్తించి వారిని సంఘాల్లో చేర్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీలత అన్నారు. సోమవారం మొయినాబాద్ మండలం చిలుకూరులోని టీటీడీసీలో డీపీఎంల, ఏపీఎంలు, సీసీలకు సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 60ఏళ్లకుపై బడిన మహిళలను, దివ్యాంగులను వృద్ధులను సంఘాల్లో చేర్పించాలని సూచించారు. కిశోర బాలికల సంఘాల ఏర్పాటుకు గ్రామ స్థాయిలో వీవోలను, సీసీలు సర్వే చేసి వివరాలు సేకరించి, అర్హులను గుర్తించి సంఘాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు భోజప్ప, డీపీఎంలు యాదయ్య, నర్సింహులు, జయశ్రీ, లిలాకుమారి, సెర్ప్ కార్యాలయ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

రికార్డులు, కేసు ఫైళ్ల పరిశీలన

సర్కిల్ ఆఫీసును తనిఖీ చేసిన ఎస్పీ

పరిగి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం పరిగి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, కేసు ఫైళ్లను పరిశీలించారు. ఎస్పీ వెంట పరిగి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు మోహన్‌కృష్ణ, భరత్‌కుమార్‌రెడ్డి, రమేశ్, వసంత్‌జాదవ్ తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న నారాయణరెడ్డి

ప్రతీ ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

తెలంగాణ ఆర్యప్రతినిధి సభ ప్రధాన్ విఠల్‌రావు ఆర్య

చౌదరిగూడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య ప్రతినిధి సభ ప్రధాన్ శ్రీవిఠల్‌రావు ఆర్య అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ ఆర్య సమాజ్‌లో కొనసాగుతున్న 46వ శ్రావణమాస పూజల్లో భాగంగా సోమవారం రెండో రోజు యజుర్వేద యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. యజ్ఞం వల్ల కాలుష్య నివారణతో పాటు సకాలంలో వర్షాలు కురుస్తాయని అన్నారు. మనుషులు ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో యజ్ఞబ్రహ్మలు అరవిందశాస్త్రి, వసుధశాస్త్రి, ఆర్య ప్రతినిధులు మచ్చ సుదాకర్ రావు, పుత్ర చిన్నయ్య, కోలేరు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, గంగ బస్వరాజ్, మురళి, శివరాజ్, స్వామి, బుగ్గయ్య, యాదయ్య, వేణు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.


యజ్ఞంలో ఆర్య ప్రతినిధి సభ్యులు

ప్రజాభీష్టం మేరకు పథకాలు

ఆమనగల్లు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల అభీష్టానికి అనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలుచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.3.9లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ, చెక్కులను అందజేశారు. ఇళ్లు, రేషన్‌కార్డులతో పేదల్లో సంతోషం నిండిందన్నారు. ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాడెమోని శ్రీశైలం, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, ప్రభాత్ శ్రీనివాస్‌రెడ్డి, బట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, జగన్, బొజ్జ సాయిరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, తాళ్ల రవీందర్, యాదయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, బాబ, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పిల్లల ఆరోగ్యంపైనే దేశ భవిష్యత్తు

పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణిస్తారని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. నులిపురుగులు, నివారించి రక్తహీనత నుంచి విద్యార్థులను కాపాడేందుకు ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు. ఆమనగల్లులోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సోమవారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్లు మంజులాదేవి, షైమూనా, శ్రీకాంత్, విజయ, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్‌లు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిషనర్ శంకర్‌నాయక్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, ఎస్‌వో పద్మజ్యోతి, ఎస్‌ఐ వెంకటేశ్, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, నాయకులు వస్పుల జంగయ్య, ఆనిశెట్టి, జగన్, కె.శ్రీనివాస్‌రెడ్డి, షైనుద్దిన్, ఖాదర్, ప్రసాద్, రాజశేఖర్, పటేల్, టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. ఎస్టీ హస్టల్‌లో హెచ్‌డబ్ల్యూవో గోపాల్ విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు.

ప్రహరీ ఏర్పాటు చేయాలని వినతి

కస్తూర్బా పాఠశాల ప్రహరీని నిర్మించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డిని స్కూల్ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, టీచర్లు కోరారు. పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు ధనలక్ష్మి, సునీత, శోభ, యాదమ్మ, సుజాత, రూప, స్వప్న, రమ్య, రామేశ్వరి, షైద, భవాని ఉన్నారు.

కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో...

కడ్తాల్/తలకొండపల్లి: కడ్తాల ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్‌లు విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, బాలీరాజ్, ఏటీడీవో వెంకయ్య, హెచ్‌డబ్ల్యూవో రాములు తదితరులు ఉన్నారు. తలకొండపల్లి మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వపాఠశాలలు, అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, టీచర్లు, ఆశా కార్యకర్తలు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు స్నేహ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

షాద్‌నగర్ నియోజకవర్గంలో మొదటి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

హాజీపల్లిలో పూజలు చేసి కొత్త బట్టలు పెట్టిన ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. నియోజకవర్గంలో నిర్మాణం పూర్తిచేసుకున్న మొట్ట మొదటి ఇందిరమ్మ ఇల్లును ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లిలో సోమవారం ఆయన ప్రారంభించారు. సంప్రదాయబద్ధంగా గృహప్రవేశం చేయించి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు స్వరూపతో పాటు ఆమె ముగ్గురు కూతుళ్లు, అల్లుళ్లకు కొత్త బట్టలు పెట్టారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు వివరించారు. రానున్న మూడున్నరేళ్లలో 15 వేల ఇళ్లు నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, దర్శన్, ఎంపీడీవో బన్సీలాల్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, మహిళలు

భూసమస్యలను వెంటనే పరిష్కరించాలి

కొందుర్గు: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. మండలంలో మొత్తం 274 దరఖాస్తులు రాగా, వాటిలో 242 అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తహసీల్దార్ రమేశ్‌కుమార్ వివరించారు. విరాసత్ కోసం 92 దరఖాస్తులకుగాను 74 ఆన్‌లైన్ చేసి 11 దరఖాస్తులను పరిష్కరించి ఒక దరఖాస్తును తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. పీవోబీకి చెందిన 41 దరఖాస్తులు టెక్నికల్ ప్రాబ్లమ్‌తో ఆన్‌లైన్ చూపించడం లేదని వివరించారు. అలాగే కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను ఈనెల 15లోపు పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల హద్దులను ఏర్పాటు చేయండి

కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిత ప్రదేశాన్ని స్థానిక అధికారులు, నాయకులతో పరిశీలించారు. కొందుర్గు పద మర శివారులోని 109లో విస్తీర్ణం 16.12 గుంటల భూమిని ప్రభుత్వ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో ఎస్‌ఆర్ సరిత, అధికారులు ఇన్‌చార్జి ఎంపీడీవో గజపతి, ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రీదేవి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఇబ్రహీం, జేపీ కృష్ణ నరెందర్, పురుషోత్తంరెడ్డి, బాబ్జరి కృష్ణారెడ్డి, మల్లేష్‌గౌడ్, రాయికంటి రామస్వామి, కృష్ణయ్య, గోపాల్, జహంగీర్, శ్రీనివాస్‌రెడ్డి, నరేయర్ అంజనేయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

షాద్‌నగర్ అర్బన్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లల కడుపులో నులుపురుగులు, జీవులను ఉండి రక్తహీనత కలిగించే పురుగులు చనిపోయి ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. షాద్‌నగర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్నామని గుర్తుచేశారు. ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలను సైతం అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... షాద్‌నగర్ డివిజన్‌లోని జూనియర్ కళాశాలలు, 689 పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రలను అందజేస్తామని తెలిపారు. ఇందుకోసం 122 మంది వైద్య సిబ్బంది, 286 మంది ఆశాలు, 318 మంది అంగన్‌వాడీలు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తైలజ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దండు శ్రీనివాస్, అగ్గనూరి బస్వం, కె. పురుషోత్తంరెడ్డి, ఎస్‌డి ఇబ్రహీం, కరుణాకర్, అశోక్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే యాతనే..

పర్వతపల్లి బీటీ రోడ్డుపై భారీ గుంతలు

రాకపోకలకు ప్రజల ఇబ్బందులు

జహీరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతపల్లి గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. కిలోమీటరు పొడవు రోడ్డు అడుగడుగునా గుంతలమయం కావడంతో గ్రామస్తులు పాట్లుపడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డుపై గుంతల్లో నీరు నిలుస్తూ రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. రోజుల తరబడి నీరు నిలుస్తోంది. రాత్రుళ్లు ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయపడిన సంఘటనలెన్నో ఉన్నాయి. రోడ్డు అధ్వానంగా మారడంతో ఆర్టీసీ బస్సు రోజూ రావడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరైనట్లు చెబుతున్నా పనులు ప్రారంభించలేదు. అధికారులు ఈ రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.


పర్వతపల్లి రోడ్డుపై నీటి మడుగు నుంచి వెళ్తున్న వాహనం

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

కడ్తాల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేదాక పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు కొట్ల కాశీరావు అన్నారు. కడ్తాల, ఎక్వాయిపల్లి, రావిచెడ్ పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ముఖ్య అతిథి కాశీరావు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏలు ఇవ్వాలని కాశీరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ, ఎస్ఎస్ఏ టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. 2008 డీఎస్సీ వారికి సత్వరమే జీతాలు చెల్లించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ మండలాధ్యక్షుడు సంతోష్‌కుమార్, గౌరవాధ్యక్షుడు బాస్కర్‌గౌడ్, నాయకులు యుగందర్, మాధవి, గౌరి, శ్రీకాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

దుద్యాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి మొదటి వార్డులో భగీరథ పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా వెళ్లింది. నీటివృథాపై ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రాదిక సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.


మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సకాలంలో పన్నులు చెల్లించాలి

శామీర్‌పేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు సకాలంలో పన్నులను చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ జ్యోతి అన్నారు. సోమవారం తూంకుంట మునిసిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్ల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు ప్రతీ వార్డులో పర్యవేక్షిస్తూ ఇంటి పన్నులను, వాణిజ్య పన్నులను వసూలు చేయాలన్నారు. పన్ను వసూళ్లకోసం అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు కమిషనర్ వివరించారు.

బీసీ రిజర్వేషన్లకు పార్లమెంట్ చట్టం చేయాలి

యాలాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో చట్టం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్లయ్య సోమవారం పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు రాష్ట్ర అసెంబ్లీ తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల చట్టం చేయకుండా రాజకీయం చేస్తోందని విమర్శించారు.

అలైన్‌మెంట్ మార్చాలని రైతుల ధర్నా

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కడ్తాల సమీపం మీదుగా వెళ్తున్న హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. కడ్తాల్‌లోని సర్వే నంబర్లు 790/24 నుంచి 126సర్వే నంబర్ల భూముల్లో 765కేవీ ట్రాన్స్‌మిషన్‌లైన్ పోళ్లకు సర్వే మార్కింగ్ చేశారన్నారు. అధికారులు సేకరించిన భూముల్లో ఎక్కువ మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారని తెలిపారు. తమ భూముల్లో పోల్స్ పాతొద్దని రైతులు కోరారు.

జెండా దిమ్మెను కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి

మంచాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):బండ లేమూర్‌లో జెండాదిమ్మెను కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జిల్లగిరెడ్డి డిమాండ్ చేశారు. బండలేమూర్‌లో బీజేపీ జెండా దిమ్మెను కూల్చిన ప్రదేశాన్ని సోమవారం పరిశీలించి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ బాషయ్య, రాజు, జంగయ్య, శ్రీశైలం, జనార్దన్‌రెడ్డి, కె.వెంకటరెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మహేందర్, రాజు, పి.యాదగిరిరెడ్డి, రవీందర్‌రెడ్డి, వినోద్, హన్మంతు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యం సమానత్వానికి మూలస్తంభాలు

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

సినీ నటి మంచులక్ష్మితో కలిసి విద్యార్థులకు ప్లేట్లు, బాలికలకు శానిటరీ న్యాప్కిన్ల అందజేత

డిజిటల్ క్లాస్‌రూం ఏర్పాటు చేస్తామన్న వేణిరావు ఫౌండేషన్ హామీ

శంకర్‌పల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్యం సమానత్వానికి మూలస్తంభాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. సినీనటి, సామాజిక సేవకురాలు మంచులక్ష్మి స్థాపించిన 'టీచ్ ఫర్ చేంజ్' సంస్థ, సేవాభావి రత్నారెడ్డి నేతృత్వంలోని వేణిరావు ఫౌండేషన్ సోమవారం శంకర్‌పల్లి మండలం జన్వాడ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్లేట్లు, హైస్కూల్ విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లను యాదయ్య, మంచు లక్ష్మి, రత్నారెడ్డిలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. మంచు లక్ష్మి టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ద్వారా బాలికల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు పాటుపడుతూ, ఆరోగ్య విషయాల్లోనూ సేవలందించడం అభినందనీయమన్నారు. వేణిరావు ఫౌండేషన్ సంస్థ జన్వాడ ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ఏర్పాటుకు ముందుకు రావడం గొప్ప విషయం అన్నారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతోనే తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. బాలికలు భయం, బిడియం లేకుండా స్వేచ్ఛగా నేర్చుకునేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో అక్బర్, హెచ్ఎం ఆఫ్రోజ్‌ఖాన్, టీచర్లు, నాయకుడు నర్సింహ పాల్గొన్నారు.


విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, సినీనటి మంచులక్ష్మి


జైపాల్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

బోనాలు తెలంగాణ

సంస్కృతికి ప్రతీక

కడ్తాల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే కాటమయ్య, పెద్దమ్మ, బీరప్ప, ఈదమ్మ, మదేలుస్వామి, మైసమ్మ, పోచమ్మ, రేణుక ఎల్లమ్మ బోనాల వేడుకల ఆహ్వాన పత్రికను పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యం, స్థానిక నాయకులతో కలిసి జైపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు రాములు, మల్లేశ్‌గౌడ్, కార్తీక్, పాండూనాయక్, హర్యానాయక్, శ్రీను, మహేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెట్టు.. భయపెట్టేటట్టు!



కులకచర్ల చౌరస్తాకు సమీపంలో పోలీస్‌స్టేషన్ మార్గంలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు విరిగి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మార్గం మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. చెట్టు ఎప్పుడు విరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈదురు గాలులు వచ్చినప్పుడు పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై కానీ, రోడ్డుపై కాని పడే అవకాశం ఉంది. ఈ మార్గం మీదుగా అధికారులు వెళ్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకముందే రోడ్డు పక్కన ఉన్న ఎండిన చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

- కులకచర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి)

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు పరిష్కారం



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తున్నామని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు



గ్రీన్ ఫీల్డ్‌కాలనీని పరిశీలిస్తున్న నందు

వికారాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్‌కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి సోమవారం బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్, దిశా కమిటీ సభ్యుడు వడ్ల నందు మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, విద్యుద్దీపాలు, విద్యుత్ స్తంభాలు వంటి మౌలిక వసతుల ఏర్పాటుకు తక్షణమే ఎస్టిమేషన్ వేయాలన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో డ్రైనేజీ పనులు చేపట్టేలా చూడాలని మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగ సిబ్బందిని కోరారు. దోమల నివారణకు పిచికారి చేయించడంతో పాటు కాలనీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చింతకాయలు కిలో రూ.200



కొడంగల్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏటా గోకుల అష్టమి పండుగకు వంటల్లో చింతకాయలను ఉపయోగిస్తుంటారు. దీంతో మార్కెట్‌లో చింతకాయలకు డిమాండ్ ఉంటుంది. వ్యాపారులు ధరను పెంచుతుంటారు. అయితే మార్కెట్‌లో సోమవారం కిలో చింతకాయలు ధర రూ.200గా ఉంది. దీంతో మునుపెన్నడూ ఇంత ధరను చూడలేదని ప్రజలు అంటున్నారు.

అనుమతుల్లేని కళాశాలపై చర్యలేవి?

- తాండూరులోని టీహెచ్ జూనియర్ కళాశాలపై చీటింగ్ కేసు నమోదు చేయాలి
- పీడీఎస్‌యూ డిమాండ్
- పట్టించుకోని నోడల్ ఆఫీసర్

తాండూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తాండూరులో అనుమతులు లేకుండా ఏడాదిగా నిర్వహిస్తున్న టీహెచ్ జూనియర్ కళాశాలపై చర్యలేవని పీడీఎస్‌యూ నాయకులు అధికారులను ప్రశ్నించారు. టీహెచ్ కళాశాలపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ సోమవారం తాండూరు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాటాడుతూ అనుమతులు టీహెచ్ కళాశాలపై ఇదివరకే నోడల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. 2024-25 సంవత్సరానికి గాను దాదాపు 80మంది విద్యార్థులను అడ్మిషన్ తీసుకొని ఇంటర్మీడియట్ వార్షికఫీజు చెల్లింపు సమయంలో స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందినట్లు చూపించి ఫీజులు వసూలు చేశారని తెలిపారు. దీంతో చైతన్య కళాశాల యజమాన్యం విద్యార్థులకు తిరిగి టీసీలు, బోనోఫైడ్‌లు ఇచ్చి పక్కకు తప్పుకుంది. ఈసారి మరో కళాశాలతో టయాప్ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2025-26 సంవత్సరానికి గానూ తమను ఏ అధికారీ ఏమి చేయలేదనే దీమాతో టీహెచ్ కళాశాల యజమాన్యం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాండూరులోనే ఉండే జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి అనుమతి లేకుండా తాండూరులో కళాశాల కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు.



తాండూరు టీహెచ్ జూనియర్ కళాశాల

పెద్దఎత్తున ధర్నా చేస్తాం



సీఎం స్వంత జిల్లాలో అనుమతి లేకుండా కళాశాల దందా నడుస్తోంది. యజమాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేయాలి. లేదంటే పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఇందిరాచౌక్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేస్తాం.

- శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం



టీహెచ్ కళాశాలకు ఎలాంటి అనుమతులు లేవు. రిజిస్ట్రేషన్ జరగలేదు. ఇప్పటికే యజమాన్యానికి పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా స్పందించడంలేదు. షోకాజ్ నోటీసులు జారీచేస్తాం.

- శంకర్ నాయక్, ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి

నులిపురుగుల నివారణలో భాగస్వాములవ్వాలి

పరిగి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణలో ప్రతీ విద్యార్థి భాగస్వాములవ్వాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకటి నుంచి 19ఏళ్లలోపు వారికి అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పాఠశాలలో సమస్యలు ఉన్నాయని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కోరగా పాఠశాల ఆవరణలో సీసీ బెడ్‌నిర్మాణానికి రూ.7లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి అమూల్య ప్రియదర్శిని

కులకచర్ల: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక బాలకల ఉన్నత పాఠశాలలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో హబీబ్ అహ్మద్, వెంకటేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సోమవారం అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు వైద్యాధికారి హేమంత్‌కుమార్ తెలిపారు.

తాండూరు: గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం మాజీ కౌన్సిలర్ సంగీత ఠాకూర్ వైద్య శాఖ అధికారులతో కలిసి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగదేవి, టీచర్ జగదీశ్వరి, డాక్టర్ రాజేశ్వరి, ఏఎన్ఎం శాంత, ఆశావర్కర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రవీందర్‌యాదవ్ కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ఇండస్ వ్యాలీ పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, ఆశా కార్యకర్తల సులోచన అల్బెండజోల్ మాత్రలను వేశారు.

దౌల్తాబాద్: చంద్రకల్ మెథడిస్టు పాఠశాలలో విద్యార్థులకు దౌల్తాబాద్ ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిణి అమూల్య ప్రియదర్శిని మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో గ్యామానాయక్, ఎంఈవో వెంకట్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి: నులిపురుగుల నిర్మూలనతో శారీరక అభివృద్ధి పెరుగుతుందని డాక్టర్ మేఘన తెలిపారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో, సబ్‌సెంటర్లలో, అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రప్ప, ఏఎన్ఎమ్ అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పెద్దేముల్:కందనెల్లి శివారులోని వీరభద్రుడి దేవాలయం వద్ద భక్తుల సందడి

బొంరాస్‌పేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే విజయగణపతి, ధ్వజస్తంభ, శిఖర, నాభిశిల ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, గోపూజ, అంకురార్పణ, పుణ్యహవాచనం, అఖండ దీపారాధన, నవగ్రహ హోమం తదితర పూజలతో బొడ్రాయి ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు.

ధారూరు: ధారూరులోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శివలింగానికి పంచామృతం, జలంతో అభిషేకించి, మారేడు బిల్వాలు, పుష్పాలతో అలంకరించి, నారికేళం, నైవేద్యం సమర్పించి మొక్కుకున్నారు. గణపతి, సుబ్రమణేశ్వర, వీరభద్రేశ్వర స్వామి, నంది, అమ్మవారి విగ్రహాలకు పూజలుచేసి నైవేద్యాలు సమర్పించి హారతినిచ్చారు.

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీభవానిరామ లింగేశ్వరస్వామి(శివాలయం)లో స్వామివారికి సోమవారం ప్రత్యేకపూజలు చేశారు. ప్రధానర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, మంగళహారతి, మంత్రపుష్పం నిర్వహించారు. అదేవిధంగా తూంకుంట పరిధిలోని శ్రీగాయత్రి మహాక్షేత్రంలో సోమవారం శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు, వాక్‌బ్రహ్మ శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్‌వీఎల్ఎన్ మూర్తి, బ్రహ్మణ వేద పండితులు శ్రీరాఘవేంద్రస్వామికి అభిషేకాలు నిర్వహించారు.

పెద్దేముల్: మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణమాసం మూడో సోమవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలను సందర్శించారు. ఉపవాసదీక్షలో ఉన్న భక్తులు దైవదర్శనం చేసుకుని నైవేద్యాలు సమర్పించారు. తట్టెపల్లి సమీపంలోని అంబురామేశ్వర దేవాలయం, కందనెల్లి శివారులోని వీరభద్రుడి ఆలయం వద్ద దాతలు అన్నదానం చేశారు. ఆలయాలకు వెళ్లి దైవదర్శనాలు చేసుకున్న భక్తులు అక్కడ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన వితరణతో ఉపవాస దీక్షలు విరమించారు.

ఘనంగా మైసమ్మ బోనాలు

చౌడాపూర్: మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి గ్రామ దేవత మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు బోనపు కుండలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. బోనాల ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక నైవేద్యాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.



బోనాలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

యూరియా.. ఏదయా!

(ఐదో పేజీ తరువాయి)

వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు మళ్లీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ఎక్కువ ధర చెల్లించినా కావాల్సిన కంపెనీల యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నా ఇక్కడి వ్యవసాయ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమార్కులపై కరువు

గతంలో పరిగిలోని ఆగ్రో ఏజెన్సీ వారు ఇటీవల రైతులకు అందాల్సిన వేరుశనగ, ఇతర విత్తనాలను దొంగదారిన బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. ఈ విషయమై స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన కరువైంది. ఆ తర్వాత పత్రికల్లో కథనాల ఆధారంగా ఉన్నతాధికారులు విచారణ జరిపి చేతులు దులుపుకున్నారు. కాగా, వారం క్రితం మళ్లీ ఆగ్రోస్ వారు డీఏపీ అధిక ధరల విక్రయాలపై రైతులు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీని కారణంగా వ్యాపారులు తమను ఎవరూ ఏం చేయరనే ధీమాతో ఇష్టమైన ధరలకు విక్రయిస్తున్నారు.

భారీగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

పరిగి పట్టణం నుంచి యూరియాను యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. పట్టణంలో దాదాపు 30 ఎరువుల దుకాణాలు ఉండగా పేరుమోసిన కొందరు వ్యాపారులు పలువురు అధికారుల సహకారం ఎరువుల బ్లాక్ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. పరిగి మండల శివార్లలో ఉన్న కొన్ని ఫ్యాక్టరీలు తమ ఉత్పత్తులను తయారు చేసేందుకు టన్నుల కొద్దీ యూరియాను వినియోగిస్తున్నారు. కొన్నేళ్లుగా వారికి పలువురు వ్యాపారులు రైతులకు విక్రయించకుండా రాత్రికి రాత్రే యూరియాను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో కొరత నేపథ్యంలో సదరు ఫ్యాక్టరీ యజమానులు రెట్టింపు ధర చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. యూరియా బస్తాకు రూ.266 ఎమ్మార్పీ ధర ఉన్నప్పటికీ బ్లాక్‌లో 350 నుంచి 400 వరకు అమ్ముతున్నారు. కాగా, విజిలెన్స్ శాఖలో పని చేస్తున్న అధికారులు సైతం వ్యాపారస్తుల వలలో పడిపోతున్నారు. సీజన్ ప్రారంభంలో విజిలెన్స్ ప్రత్యేక బృందాలు ఎలు దుకాణాల్లో తనిఖీ నిర్వహించిన సమయంలో పట్టుబడినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. రికార్డులు సరిగ్గా లేకపోవడం, రైతులకు రశీదు ఇవ్వకపోవడాన్ని గుర్తించినప్పటికీ ఏ చర్యలు తీసుకోలేదు.

యూరియా కొరత లేదు



మార్కెట్‌లో యూరియా కొరత లేదు. రైతులు ఆందోళన చెందొద్దు. అధిక ధరలకు విక్రయాలపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవలే కొన్ని షాపుల్లో తనిఖీలు నిర్వహించాం. ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఒకవేళ రుజువు అయితే లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

- రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

చెరువులు, కుంటలకు జలకళ

(ఐదో పేజీ తరువాయి)

వర్షపాతం నమోదైంది. నవాబుపేట మండలంలోని అక్నాపూర్, అత్తాపూర్, చింతల్‌పేట్, ఏక్‌మామిడి, కేశవపల్లి, నాగిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

బొంరాస్‌పేట్‌లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బురాన్‌పూర్- మదన్‌పల్లి మార్గంలో చిన్నవాగు ప్రాజెక్టు వద్ద తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో మదన్‌పల్లి, బురాన్‌పూర్ గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. అదే విధంగా ఏర్పుమళ్ల గ్రామ శివారులోని కాకరవాణి ప్రాజెక్టు భారీ వర్షానికి అలుగు పారింది. ఎన్నేపల్లిలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద ఉధృతి తగ్గిన తర్వాత పొలానికి వెళ్లిన రైతులు తాడు సాయంతో వాగును దాటారు.



బొంరాస్‌పేట్: చిన్నవాగు ప్రాజెక్టు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

కీసరలో పిడుగుపాటు

కీసరలో మోహన్‌లాల్ చౌదరి ఇంటిపై ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురై ఇంట్లో నుంచి ఎవరూ బయటకి వచ్చేందుకు సాహసించలేదు. దీంతో తెల్లారి చూసే సరికి పిడుగుపాటుకు ఇంటి స్లాబ్ గోడ కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో మోహన్‌లాల్ కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

వికారాబాద్‌లో మోస్తరు వర్షం

వికారాబాద్: వికారాబాద్ జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు కురిసిన వర్షానికి మూసీనది ఉధృతితో ప్రవహించగా, వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. రైతుబజార్ లోకి వర్షపునీరు చేరింది.

ముసురుతో ముప్పు

తాండూరు/తాండూరురూరల్/బషీరాబాద్: తాండూరులో ముసురువర్షంతో ముప్పు పొంచి ఉంది. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్లు చిత్తడిగా మారాయి. సోమవారం ఉదయం మట్టి రోడ్లు బురదమయంగా మారడంతో ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. ఆదర్శనగర్‌లో అంతర్గత మురుగు కాల్వలు నిండి పొంగిపొర్లాయి. ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన సమీనాబేగం ఇళ్ల పైకప్పు కూలిపోయింది. బెల్కటూర్ గ్రామ సమీపంలో ఉన్న కాగ్నావాగు పొంగిపోర్లింది. పాత బ్రిడ్జి తెగిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామంలో కురిసిన భారీ వర్షానికి ఎస్సీ కాలనీ జలమయమైంది. వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు కాలనీవాసులు బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. క్యాద్గిరాలో రైతు హైమాత్ రెండు కాడెడ్లు మృత్యువాతపడ్డాయి.



ఇంద్రానగర్‌లో కూలిన సమీనా బేగం ఇల్లు

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సాయికిరణ్ మృతదేహం

మోమిన్‌పేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మోమిన్‌పేట్ మండలంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెల్చాల్ గ్రామానికి చెందిన సాయికిరణ్‌తో ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని బెల్టుషాపు వద్ద దుర్గం చెరువు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మీ చెల్లెలి పెళ్లికి తీసుకున్న రూ.5వేలు ఇవ్వవా? అని గొడవకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న తల్లి గోవిందమ్మ తన కుమారుడి ఆచూకీ తెలియడం లేదని గొడవ చేసిన వ్యక్తుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మర్పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గల పట్టాల వద్ద సాయికిరణ్ మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కగానొక్క తన కుమారుడిని దుర్గం చెరువు గ్రామానికి చెందిన వ్యక్తులే హత్య చేసి ఉంటారని మృతుడి తల్లి గోవిందమ్మ, తండ్రి మల్లేశం, కుటుంబసభ్యులు బోరున విలపించారు. సాయికిరణ్ మృతికి కారణమైన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కోరారు.

మేకల మందపై కుక్కల దాడి

- 12 మేక పిల్లలు మృత్యువాత



మృత్యువాతపడిన మేకపిల్లలు

ధారూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాకలో ఉన్న మేకపిల్లలపై కుక్కలు దాడిచేయగా 12మేక పిల్లలు మృత్యువాత పడ్డారు. మండలంలోని అంతారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చాకలి యాదయ్యకు 20మేకలు ఉన్నాయి. కాగా వీటికి పుట్టిన 12మేక పిల్లలను పాకలో ఉంచి బంధువుల వివాహ వేడుకకు వెళ్లాడు. ఈ క్రమంలో పాకలో ఉన్న మేకపిల్లలపై కుక్కలు దాడిచేశాయి. దీంతో 12మేకపిల్లలు మృత్యువాతపడ్డాయి. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.


ఇసుక తవ్వకాలకు అనుమతివ్వొద్దు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

యాలాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథ్‌పూర్ కాక్రవేణి నది నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. మండల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, రైతులతో కలిసి సోమవారం వికారాబాద్‌లోజి కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వనాథ్‌పూర్ కాక్రవేణి నది నుంచి ఇసుక తవ్వకాల మూలంగా బోరు మోటార్లకు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యాలాల, గోవిందరావుపేట రైతులు గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, బుర్నపురి నాగప్ప, మాధవరెడ్డి, అశోక్, గజ్జల మల్లప్ప, అహ్మద్, బసప్ప, పీర్నియిపల్లి భాస్కరచారి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16న చలో తాండూరు



పెన్షన్‌దారులతో మాట్లాడుతున్న మల్లికార్జున్ మాదిగ

తాండూరు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పెన్షన్లు వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీ చలో తాండూరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి నర్సింహులు మాదిగ పేర్కొన్నారు. కోటబాస్పల్లి గ్రామంలో సోమవారం పెన్షన్ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

ధారూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధారూరు స్టేషన్ గ్రామంలో రాత్రివేళలో విద్యుత్ సమస్యలపై స్థానికులు సోమవారం ఏఈ వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కొద్ది రోజులుగా గ్రామంలో ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయంపై లైన్‌మన్ రాజ్‌కుమార్‌కు తెల్పినా స్పందించటం లేదని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించి, బాధ్యతారహితంగా వ్యవరిస్తున్న లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పేదల ఆరోగ్యానికి అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కులు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి, శంకర్‌యాదవ్

మోమిన్‌పేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్యానికి అండగా ఉంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.32మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరోత్తంరెడ్డి, సురేందర్, ఏరాజ్‌పాష, సుభాష్ పాల్గొన్నారు.